సాక్షి
రంగారెడ్డి
శనివారం । 16 । మార్చి । 2024



నీ భూమికేది రక్షణ!

మొయినాబాద్ మండలం తోలుకట్టలో దేవుడి భూమిని కబ్జాచేసి దాని చుట్టూ ప్రహరీ నిర్మిస్తున్నారు. 8లో ▸



బిందు సేద్యమే బాగు

బోర్లలో రోజురోజుకూ నీరు తగ్గిపోతోంది. సమృద్ధిగా నీరు లేకపోవడంతో రైతులు బిందుసేద్యం వైపు ఆసక్తి చూపిస్తున్నారు. 8లో ▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : శనివారం (సాయంత్రం) 6:32
సహర్ : ఆదివారం (ఉదయం) 5:01

న్యూస్‌రీల్

బీజేపీలో నూతన నియామకాలు

తుర్కయంజాల్: బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు, పలు మండలాలు, మున్సిపాలిటీలకు అధ్యక్షులను నియమిస్తూ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహా రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. జిల్లా కార్యవర్గ సభ్యులుగా నందిగామ మండలానికి చెందిన మేడిశెట్టి కృష్ణమోహన్, షాద్‌నగర్‌కు చెందిన మటం రుషి, కొందుర్గుకు చెందిన బోయ శంకర్, మంచాలకు చెందిన గోవర్ధనాచారిని నియమించారు. కేశంపేట మండల అధ్యక్షుడిగా చౌలపల్లి గ్రామానికి చెందిన రోల్లు రఘురామ్ గౌడ్, కొత్తూరు మండల అధ్యక్షుడిగా ఇన్ములనర్వ గ్రామానికి చెందిన మంగలి రమేష్, నందిగామ మండలానికి సీహెచ్. చెన్నయ్య, షాద్‌నగర్ మున్సిపాలిటీకి కోరమోని హరిభూషణ్, మంచాల మండల అధ్యక్షుడిగా ఆరుట్ల గ్రామానికి చెందిన పండల జంగయ్యను నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

తుర్కయంజాల్: ఉపాధ్యాయ నియామకాల కోసం ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ, డీఎడ్, బీఎడ్ అర్హత కలిగిన షెడ్యూల్డ్ కులాల అభ్యర్థులకు తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి జె.రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 26వ తేది వరకు దరఖాస్తు చేసుకోవాలని, వీరికి ఏప్రిల్ 3 నుంచి జూన్ 2వ తేదీ వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

వేసవి శిక్షణ శిబిరం అభినందనీయం

సాంఘిక సంక్షేమ గురుకులాల ఆర్‌సీవో డాక్టర్ శారద



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న ఆర్‌సీవో శారద

మొయినాబాద్‌రూరల్: ఇంటర్ పరీక్షలు ముగిసిన నేపథ్యంలో విద్యార్థులకు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో వేసవి శిక్షణ శిబిరం నిర్వహించడం అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకులాల ఆర్‌సీవో డాక్టర్ శారద అన్నారు. మండల పరిధిలోని తోల్‌కట్ట సమీపంలో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ చేవెళ్ల గురుకుల పాఠశాల, కళాశాలలో శుక్రవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి శిక్షణ శిబిరాన్ని ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. లైఫ్ స్కిల్స్, మొబైల్ యాప్స్, ఇంటర్ పినియర్స్ యంగ్ జర్నలిస్ట్ అంశాలపై విద్యార్థులకు ఈనెల 15 నుంచి 29 వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. గురుకులాల సంస్థ కార్యదర్శి సీతాలక్ష్మి మాట్లాడుతూ.. విద్యార్థులకు ఈ అవగాహన ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి, బంట్వారం ప్రిన్సిపాల్ ఉషారాణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

31లోగా దరఖాస్తు చేసుకోవాలి

అనంతగిరి: ప్రమాదవశాత్తు చనిపోయిన, అంగవైకల్యం పొందిన కార్మికులకు పరిహారం పొందడానికి ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సహాయ కార్మిక కమిషనర్ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎక్స్‌గ్రేషియా పొందేందుకు వీలుగా కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ ఈశ్రమ్ పోర్టల్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు ఈ పోర్టల్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద 2022 మార్చి 31 వరకు ఈశ్రమ్ పోర్టల్‌లో పేరు నమోదు చేసుకుంటే ప్రమాదవశాత్తు చనిపోయిన కార్మికుల నామినీలకు రూ.2లక్షలు, అంగవైకల్యం పొందిన కార్మికుడికి రూ.లక్ష పరిహారం అందుతుందన్నారు.



ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

ఆధ్యాత్మిక ఝరి

- కన్హాలో అంతర్జాతీయ ఆధ్యాత్మిక సమ్మేళనం
- ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- దేశవిదేశాల నుంచి తరలివచ్చిన ప్రముఖులు
- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



విమానాశ్రయంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ శశాంక తదితరులు

నందిగామ: భారత దేశం సర్వమత సమ్మేళనమని హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ గురూజీ, గ్లోబల్ గైడ్ కమ్లేష్ పటేల్(దాజీ) అన్నారు. మండల పరిధిలోని కన్హా శాంతి వనంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ ఆధ్యాత్మిక సమ్మేళనంలో శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాజీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ధ్యానం చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. ఇంట్లోని పిల్లలకు చిన్నప్పటి నుంచే ఎదుటి వారికి సాయం చేసే అలవాటు నేర్పించాలని, సమాజంలో మార్పు తీసుకు వచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లలు, వారి తల్లిదండ్రులకు చదువు గురించి వివరించి, చదువు ప్రాముఖ్యతను చాటి చెప్పాలన్నారు. పిల్లలకు తప్పనిసరిగా చదువు చెప్పించేందుకు కృషి చేయాలని, సమాజానికి ఉపయోగపడే పనులు చేయించాలని, మొక్కలను విరివిగా నాటి సంరక్షించాలని అన్నారు. చిన్నప్పటి నుంచే సేవా భావంతో పాటు, సమాజానికి ఉపయోగ పడే పనులను అలవాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అన్ని మతాలకు చెందిన ఆధ్యాత్మికవేత్తలు పాల్గొనడం.. అన్ని మతాల సారాంశం ఒక్కటే అని, అందరు సమానమే అని చాటి చెప్పడం ప్రపంచ శాంతికి శుభ సూచకమని వివరించారు.



మాట్లాడుతున్న కమ్లేష్ పటేల్

మంచి కార్యక్రమం..

కన్హా శాంతి వనంలో నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక సమ్మేళనం సమాజంలో చాలా మార్పు తీసుకు వస్తుందని అపోలో ఆస్పత్రి వైస్ ప్రెసిడెంట్, సినీ హీరో రామ్‌చరణ్ సతీమణి ఉపాసన కొణిదెల అభిప్రాయం వ్యక్తం చేశారు. ధ్యానం ద్వారా మనస్సు ప్రశాంతంగా ఉంటుందన్నారు. కుల మత, ప్రాంత భేదం లేకుండా ప్రతి ఒక్కరూ వీలైనంత వరకు ధ్యానం చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు.

అలరించిన ఆటపాట

మంగ్లీ తన ఆట పాటలతో విశేషంగా ఆకట్టుకున్నారు. వీరితో పాటు పలు మతాలకు చెందిన నృత్యకారులు, కళాకారులు తమ ఆటలు, పాటలతో అలరించారు.



మంగ్లీ గీతాలాపన

ఆందోళన వద్దు

ఒత్తిడికి గురి కావొద్దు

- ప్రశాంతంగా పరీక్ష రాయాలి
- 'పది'కి పక్కాగా ఏర్పాట్లు చేశాం
- 'సాక్షి'తో డీఈఓ సుశీందర్‌రావు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: 'పదో తరగతి పరీక్షలను ప్రశాంతమైన వాతావరణంలో, పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం. మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్‌కు తావు లేకుండా పటిష్టమైన భద్రత కల్పిస్తున్నాం. ఇందుకోసం అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే ఉపాధ్యాయులను ఉపేక్షించబోం. విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురికావొద్దు. ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాయాలి' అని జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావు అన్నారు. అంధులు, దివ్యాంగుల కోసం ఎగ్జామ్‌నేటర్లను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న టెన్త్ పరీక్షల ఏర్పాట్లపై శుక్రవారం 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆయన మాటల్లోనే..

సిబ్బందికి శిక్షణ

జిల్లా వ్యాప్తంగా 239 పరీక్ష కేంద్రాలను ఎంపిక చేశాం. 50,946 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. 2,200 మంది ఇన్విజిలేటర్లు, 239 మంది చీఫ్ సూపరింటెండెంట్లను ఎంపిక చేసి, శిక్షణ ఇచ్చాం. ఈనెల 18 నుంచి ఏప్రిల్ 2 వరకు.. ప్రతి రోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష ఉంటుంది. విద్యార్థులను అరగంట ముందే పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తాం. నిర్దేశిత సమయం తర్వాత వచ్చే వాళ్లను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోం.

నిఘా నీడలో పరీక్షలు..

పరీక్షల నిర్వహణ కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేశాం. ప్రశ్నపత్రాల నిల్వ కోసం 37 కేంద్రాలు ఎంపిక చేశాం. పరీక్ష కేంద్రాలకు ఆయా ప్రశ్నాపత్రాలను తరలించేందుకు 10 రూట్లను ఎంపిక చేశాం. ఎంఈఓ స్థాయిలోని తొమ్మిది మంది అధికారులతో ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశాం. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశాం. సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసి వేయాల్సిందిగా ఇప్పటికే ఆదేశాలు జారీ చేశాం.

మౌలిక సదుపాయాలు

పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాం. తాగునీరు, మరుగుదొడ్లతో పాటు ఉక్కపోత నుంచి ఉపశమనం కోసం ఫ్యాన్లు ఏర్పాటు చేయించాం. పరీక్ష సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాల్సిందిగా ఆ శాఖాధికారులకు సూచించాం. విద్యార్థుల రాకపోకల కోసం ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడుపుతోంది. ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా, విద్యార్థులు సాధ్యమైనంత వరకు నిర్దేశిత సమయానికి అరగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి. ఆఖరి నిమిషంలో హడావుడిగా వచ్చి ఆందోళన చెందొద్దు.

పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

పిల్లల ఆరోగ్యం విషయంలో తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి. ఎక్కువ సేపు మేల్కొని ఉంటే ఉదయం తలనొప్పితో బాధపడే అవకాశం ఉంది. పరీక్ష సరిగా రాయలేరు. ప్రస్తుతం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. పరీక్షల హడావుడిలో పడి చాలా మంది పిల్లలు ఉదయం ఏమీ తినకుండా ఖాళీ కడుపుతో వస్తుంటారు. వీరికి తేలికగా జీర్ణమయ్యే తాజా ఆహారాన్ని అందించాలి. లేదంటే వడదెబ్బకు గురై స్పృహ తప్పి పడిపోతుంటారు. ఇలాంటి వారికి తక్షణ వైద్య సేవలు అందించేందుకు అన్ని కేంద్రాల్లోనూ ఏఎన్ఎం,స్టాఫ్ నర్సులను అందుబాటులో ఉంచాం.అవసరమైన మందులు సిద్ధం చేశాం.



నల్లవెల్లి నర్సరీలో పెంచుతున్న మొక్కలను పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ శ్రీలత తదితరులు

ప్రతి కూలీకి వంద రోజుల పని

డీఆర్‌డీఓ శ్రీలత

యాచారం: జాబ్ కార్డులున్న ప్రతి కూలీకి వంద రోజుల పనిదినాలు కల్పించడమే లక్ష్యమని డీఆర్‌డీఓ శ్రీలత పేర్కొన్నారు. యాచారం మండలాన్ని శుక్రవారం సందర్శించిన ఆమె ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, ఏపీఓ లింగయ్యతో సమావేశమయ్యారు. మండలంలోని 24 గ్రామాల్లో ఏఏ రకాల ఉపాధి పనులు జరుగుతున్నాయి, ఏ పనులు చేయిస్తున్నారు, నిత్యం ఉపాధి పనులకు కూలీలు ఎంత మంది వస్తున్నారు, వేతనాలు ఎన్ని రోజులకు బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్నాయి తదితర వివరాలపై ఆరా తీశారు. అనంతరం నల్లవెల్లి గ్రామంలో పర్యటించారు. ఉపాధి పనుల వద్దకు వెళ్లి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫాంపాండ్స్ పనుల తీరు చూసి అధికారులను అభినందించారు. నర్సరీలో మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భూగర్భజలాల పెంపు కోసం ఫాంపాండ్స్ తవ్వకాలపై దృష్టి పెట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 15 వేల మందికి పైగా కూలీలు ఉపాధి పనులకు వస్తున్నారని అన్నారు. వారం, పది రోజుల్లో నిత్యం 50 వేల మంది కూలీలు ఉపాధి పనులకు వచ్చేలా చైతన్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. భారీ వర్షాలు కురిసిన వెంటనే నర్సరీల్లో పెంచే మొక్కలు నాటేలా గుంతలు తీసి సిద్ధంగా ఉంచాలని ఆమె ఈజీఎస్ సిబ్బందిని ఆదేశించారు. ఉపాధి పనులు చేసే సమయంలో కూలీలకు ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కూలీలకు సకాలంలో వేతనాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీఓ సుభాషిణి, ఇబ్రహీంపట్నం ఏపీడీ సుక్రియా నాయక్ తదితరులు ఉన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

- భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్

మంచాల: కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి గెలిపిస్తే దేశంతో పాటు రాష్ట్రం కూడా అభివృద్ధి సాధిస్తుందని బీజేపీ భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ అన్నారు. మండలంలోని సోముల, లింగంపల్లి, తాళ్లపల్లిగూడ, చిత్తాపూర్, తిప్పాయిగూడ, ఆరుట్ల, జాపాల, మంచాల గ్రామాల్లో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. అనంతరం మంచాలలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత దేశ చరిత్రలోనే రాజకీయంగా కీలక మలుపులు రానున్నాయన్నారు. దేశంలో మూడోసారి మోదీ ప్రధాని కావడమే గాకుండా 400కు పైగా ఎంపీ సీట్లు గెలుస్తుందని తెలిపారు. తెలంగాణలో 12 ఎంపీ సీట్లు గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేస్తే ఆరు గ్యారంటీలంటూ గాలికి వదిలేశారని, గతంలో ఉన్న సంక్షేమ పథకాలను కూడా అమలు చేయడం లేదని విమర్శించారు. తనను ఎంపీగా గెలిపిస్తే రాచకొండ గుట్టలను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని, డిండి ఎత్తిపోతల పథకం ద్వారా ఇబ్రహీంపట్నం చెరువులోకి నీళ్లు తీసుకొచ్చి ఈ ప్రాంతం సస్యశ్యామలంగా ఉండేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అభివృద్ధి చేసే నాయకులను గుర్తించి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పొందాల జంగయ్య గౌడ్, రాష్ట్ర నాయకులు గోగిరెడ్డి లచ్చిరెడ్డి, బోసుపల్లి ప్రతాప్, వింజమూరి వెంకట్‌రెడ్డి, నర్సింహారెడ్డి, అంజయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ఆరుట్లలో ఓ గిరిజన మహిళను బీజేపీకి ఓటు వేయాలని కోరుతున్న బూర నర్సయ్య గౌడ్



మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

అనవసర 'కోత'లొద్దు

- సహజ ప్రసవాల సంఖ్య పెంచండి
- వైద్యులతో కలెక్టర్ శశాంక

సాక్షి,రంగారెడ్డిజిల్లా: ప్రైవేటు ఆస్పత్రుల్లో సి–సెక్షన్ ప్రసవాలు తగ్గించాలని, ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందేలా సామాజిక దృక్పథంతో పని చేయాలని కలెక్టర్ శశాంక వైద్యులకు సూచించారు. ఈ–బర్త్ పోర్టల్‌ను ఉపయోగించాలని కోరారు. గచ్చిబౌలిలోని ఏఐజీ హాస్పిటల్‌లో శుక్రవారం జిల్లాలోని గుర్తింపు పొందిన ప్రైవేటు ఆస్పత్రులు, గైనకాలజిస్టులకు పీసీ అండ్ పీఎన్‌డీటీ, ఎంటీపీ, సరోగసీ చట్టాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సి–సెక్షన్ డెలివరీ విధానంలో తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని అన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన రాష్ట్ర సంయుక్త సంచాలకులు డాక్టర్ పద్మజ మాట్లాడుతూ.. చట్టబద్ధ గర్భస్రావాలు చేసేటప్పుడు నిర్దిష్ట ప్రమాణాలు పాటించాలని తెలిపారు. లేదంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. జిల్లా ఆరోగ్య రంగంలో అభివృద్ధి చెందినప్పటికీ నార్మల్ డెలివరీలు, 0–6 సంవత్సరాల పిల్లల సెక్స్ రేషియో (లింగ నిష్పత్తి)లో వెనుకంజలో ఉండడాన్ని అధిగమించడానికి ప్రయత్నించాలని కోరారు. మాత శిశు ఆరోగ్యం ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సృజన మాట్లాడుతూ.. మెటర్నల్ ప్రొటోకాల్స్, సరోగసీ ప్రొటోకాల్స్ తప్పనిసరిగా బర్త్ మానిటరింగ్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రైవేటు ఆస్పత్రులకు వచ్చే ప్రతి టీబీ కేసును సంబంధిత ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో నమోదు చేయాలని జిల్లా క్షయ నిర్మూలన అధికారి డాక్టర్ అరుణకుమారి తెలిపారు.

పిల్లలకు న్యాయం చేయండి

- రోడ్డు ప్రమాదంలో దంపతుల మృతి
- మృతదేహాలతో బంధువులు, గ్రామస్తుల ఆందోళన

చేవెళ్ల: మండలంలోని మల్లారెడ్డిగూడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న మల్లేశ్ శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందాడు. షాబాద్ మండలం బొబ్బిలిగామకు చెందిన ఆవుల మల్లేశ్ (40), భార్య నవనీత (32)తో కలిసి గురువారం బైక్‌పై వస్తుండగా వెనుక నుంచి కారు ఢీకొట్టడంతో నవనీత అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్ర గాయాలైన మల్లేశ్‌ను ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం తుదిశ్వాస విడిచాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని నాగర్‌కర్నూల్ జిల్లా గోవిందపల్లికి చెందిన కారు డ్రైవర్ శివను గుర్తించి అరెస్ట్ చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంధువుల ఆందోళన

నవనీత మృతదేహం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రిలో ఉండగా మల్లేశ్ మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి నుంచి తీసుకు వచ్చారు. పిల్లలకు న్యాయం చేయాలంటూ బంధువులు, కుటుంబసభ్యులు, గ్రామస్తులు రెండు మృతదేహాలతో ఆందోళన చేపట్టారు. కుటుంబానికి ఆధారంగా ఉన్న తల్లిదండ్రులు చనిపోవడంతో ఇద్దరు పిల్లలు అనాథలుగా మారారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదానికి కారణమైన వ్యక్తిని తీసుకురావాలని పట్టుబట్టారు. చేవెళ్ల పోలీస్‌స్టేషన్ ఎదుట రోడ్డుపై బైఠాయించారు. నార్సింగి ఏసీపీ రమణగౌడ్, ఎస్‌ఓటీ సీఐ రమణారెడ్డి ఆధ్వర్యంలో చేవెళ్ల, షాబాద్ పోలీస్‌స్టేషన్లకు చెందిన సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. పోలీసులు సర్దిచెప్పినా వినిపించుకోకుండా వారు ధర్నా కొనసాగించారు. బొబ్బిలిగామకు చెందిన తాజా మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్ ఆందోళన చేస్తున్నవారితో మాట్లాడారు. న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. అనంతరం రెండు మృతదేహాలను గ్రామానికి తీసుకెళ్లి అంత్యక్రియలు చేశారు.



చేవెళ్ల పోలీస్‌స్టేషన్ ఎదుట రోడ్డుపై ఆందోళన చేస్తున్న మృతుల బంధువులు, గ్రామస్తులు

శాంతిభద్రతలకు సహకరించాలి

సీఐ బాబ్యనాయక్


ఆరుట్లలో కవాతు చేస్తున్న పోలీసులు

మంచాల: లోక్‌సభ ఎన్నికలో ఓటర్లు ప్రశాంత వాతావరణంలో తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని మంచాల సీఐ బాబ్యనాయక్ అన్నారు. ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో మంచాల, ఆరుట్ల గ్రామాల్లో పోలీసులు శుక్రవారం కవాతు నిర్వహించారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండే విధంగా ప్రజలు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంచాల ఎస్ఐ రవినాయక్‌తోపాటు సీఐఎస్ఎఫ్ జవాన్లు 40 మంది, 10మంది పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ

జాతీయ స్థాయిలో 81 సీట్లు సాధించిన రేయాన్ సంస్థ


ప్రతిభ కనబరిచిన రేయాన్ సైనిక్ స్కూల్స్ విద్యార్థులు

నాగోలు: దేశ వ్యాప్తంగా నిర్వహించిన సైనిక్ స్కూల్స్ పరీక్షల్లో నాగోలు బండ్లగూడలోని రేయాన్ సైనిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ మేరకు పాఠశాల నుంచి 81 మంది విద్యార్థులు సైనిక్ స్కూల్స్‌కు ఎంపికయ్యారని రేయాన్ సైనిక్ స్కూల్స్ చైర్మన్ జి.జనార్దన్‌రెడ్డి తెలిపారు. రేయాన్‌లో ఏర్పాటు చేసిన సక్సెస్ మీట్‌లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించారు. ఈ సందర్భంగా జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా నిర్వహించిన పరీక్షలలో 284 టాప్ మార్కులతో పాటు 81 మంది విద్యార్థులు దేశ వ్యాప్తంగా ఎంపికయ్యారని తెలిపారు. మ్యాథ్స్‌లో ఆరుగురు విద్యార్థులు 150/150, ఐటీలో ముగ్గురు 50/50 మార్కులు సాధించారని వెల్లడించారు. అంతేగాకుండా రాష్ట్రీయ మిలటరీ స్కూల్ (ఆర్ఎంఎస్)కు కూడా నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారని వివరించారు. ఈ సందర్భంగా కోచింగ్ సెంటర్ డైరెక్టర్ ఉమారెడ్డి మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం రేయాన్ సంస్థ నుంచి జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకుతో పాటు అత్యధిక సీట్లతో రేయాన్ సైనిక్ స్కూల్ కోచింగ్‌లో అగ్రస్థానంలో ఉన్నామని తెలిపారు. వరుసగా గత 10 సంవత్సరాలుగా ఆలిండియా మొదటి ర్యాంక్ సాధిస్తున్నామని చెప్పారు. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఫీజులో రాయితీ ఇచ్చి ప్రోత్సహిస్తున్నామన్నారు.

బిందు సేద్యమే బాగు

- ఆరుతడి పంటలపైన అన్నదాతల దృష్టి
- సబ్సిడీ ద్వారా డ్రిప్ అందించాలని విజ్ఞప్తి


ఏపుగా పెరిగిన గోకరపంట

కేశంపేట: వర్షాభావం కారణంగా బోర్లలో రోజురోజుకు నీరు తగ్గిపోతుండటంతో పంటలు ఎండిపోతున్నాయి. సమృద్ధిగా నీరు లేకపోవడంతో రైతులు బిందుసేద్యం వైపు ఆసక్తి చూపిస్తున్నారు. బిందుసేద్యంతో నీటి వినియోగం తక్కువగా ఉంటుంది. దీంతో ఆరుతడి పంటలైన కూరగాయల వైపు రైతులు దృష్టి మళ్లిస్తున్నారు. ఎండలు మండుతున్న తరుణంలో ఒక్కో నీటి బిందువును ఒడిసి పట్టుకొని సాగుకు ఉపక్రమించాల్సి ఉంటుంది. దీనికి తుంపరసేద్యం దోహదపడుతుంది. ప్రభుత్వం సబ్సిడీపై ఇవ్వాల్సిన డ్రిప్‌ను కొంతకాలంగా నిలిపి వేసింది.

కూరగాయల సాగు

మండలంలో టామాటా, మిర్చి, వంకయ, గోకరకాయ తదితర పంటలను రైతులు బిందుసేద్యం ద్వారా పండిస్తున్నారు. నీటి వసతి తక్కువగా ఉన్న వారు మామిడి, కాకరకాయ, జామ తోటలకు డ్రిప్‌ను వాడుతున్నారు. డ్రిప్ వాడటంతో వ్యవసాయంలో కూలీల ఖర్చు కూడా తగ్గుతుంది. పంటలకు అవసరమైన ఎరువులను ఫిల్టర్ బాక్స్‌లల్లో వేయడం ద్వారా నేరుగా పంటకే ఎరువులు అందుతాయి. అంతే కాకుండా పంటకు నీరు పెట్టడానికి రైతు పొలం వద్ద వేచి ఉండాల్సిన అవసరం లేదు.

సబ్సిడీ కోసం ఎదురుచూపు

ప్రభుత్వం సబ్సిడీపైన ఇదివరకు అందించేది. ధరణి పథకం తర్వాత నిలిపి వేసింది. రైతుబంధు వస్తున్నప్పటి నుంచి సబ్సిడీ డ్రిప్‌ను ప్రభుత్వం అందిచడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. సబ్సిడీపైన డ్రిప్ సరఫరాను ప్రభుత్వం అందించకపోవడంతో నీటి వసతి లేకపోవడంతో చిన్న, సన్నకారు రైతులు వ్యవసాయం చేయడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అవగాహన కల్పించాలి

బిందుసేద్యంతో కలిగే ప్రయోజనాలను రైతులకు అవగాహన కల్పించాలి. వర్షాలు లేక ఒకవైపు నీటి మట్టాలు రోజురోజుకు తగ్గుతున్న ఇలాంటి పరిస్థితుల్లో ఆరుతడి పంటల వైపు దృష్టి పెట్టేలా అధికారులు కృషి చేయాలి. కానీ గ్రామాల్లో అధికారులు అవగాహన కల్పిస్తున్న దాఖలాలు కన్పించడం లేదు. ఇటీవలే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోని ప్రజా ప్రభుత్వం గతంలో ఇచ్చిన విధంగానే సబ్సిడీ పైన డ్రిప్‌ను అందించాలని రైతులు కోరుతున్నారు.

శ్రమ తక్కువ



బిందుసేద్యంతో వ్యవసాయంలో శ్రమ తగ్గుతుంది. పంటలకు వేయాల్సిన ఎరువులను డ్రిప్ వద్ద గల ఫిల్టర్ బాక్స్‌లో వేస్తే ప్రతి మొక్కకు నేరుగా ఎరువు చేరుతుంది. దీంతో కూలీల ఖర్చు తగ్గుతుంది. తక్కువ నీటితో ఎక్కువ వ్యవసాయం చేయవచ్చు. మొక్కలకు సకాలంలో నీరు అంది దిగుబడి పెరుగుతుంది.

– జయరాంనాయక్, రైతు, తూర్పుగడ్డతండా

రాయితీపై డ్రిప్ అందించాలి



గతంలో ఇచ్చిన విధంగానే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోని ప్రజాప్రభుత్వం రైతులకు సబ్సిడీ పైన డ్రిప్‌ను అందించాలి. అర్హులైన ప్రతి ఒక్కరికి అవసరం ఉన్నంత వరకు డ్రిప్ ఇవ్వడం వల్ల ఆరుతడి పంటలను రైతులు సాగు చేసేందుకు అవకాశం ఉంటుంది. ప్రభుత్వం డ్రిప్ అందించేందుకు కృషి చేయాలి.

– ప్రభాకర్‌జీ, రైతు, పాపిరెడ్డిగూడ

నిరుపేదలకు నిత్యాన్నదానం

గోల్కొండ: నిరుపేదలు, ప్రభుత్వ ఆసుపత్రులకు రోగుల వెంట వచ్చే సహాయకుల కోసం 733 రోజులుగా నిత్యాన్నదానం చేస్తున్నామని గోల్కొండ సెకండ్ లాన్సర్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహ్మద్ బషీర్ తెలిపారు. వివిధ ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద రోగుల సహాయకులు ఆకలితో అలమటించకూడదనే ఉద్దేశంతో శుక్రవారం కూడా ఆయన అన్నదానం చేశారు.



నగర ముఖద్వారం.. దుర్గంధ భరితం

పెద్దఅంబర్‌పేట పురపాలక పరిధిలోని ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో విజయవాడ జాతీయ రహదారిపై కొన్ని రోజులుగా చెత్త దర్శనమిస్తోంది. సమీపంలోని దుకాణదారులు, బాటసింగారం పండ్ల మార్కెట్‌కు వచ్చే వాహనదారులు చెత్తను ఇక్కడే కుప్పలుగా వేస్తున్నారు. దీంతో పరిసరాలన్నీ దుర్గంధంతో వ్యాప్తి చెందుతున్నాయి. అటుగా వెళ్లే వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. అధికారులు స్పందించి చెత్తను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

– అబ్దుల్లాపూర్‌మెట్

పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్


పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రసాగర్

మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య మెరుగుకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్ తెలిపారు. మున్సిపాలిటీలోని 11వ వార్డులో శుక్రవారం చెత్త తొలగింపు పనులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలోని 24 వార్డుల్లో పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్ చేపట్టామని.. ఇప్పటివరకు 11 వార్డుల్లో ఈ పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. పబ్లిక్ హాలిడేస్ మినహాయించి వచ్చేనెల 10వ తేదీ వరకు ఈ డ్రైవ్ కొనసాగుతుందన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు ప్రజలు సహకరించాలన్నారు. తడి,పొడి చెత్తను వేరుచేసి ఇవ్వాలన్నారు.

హనుమా.. నీ భూమికేది రక్షణ!

- తోలుకట్టలో దేవాదాయశాఖ భూమికి ఎసరు
- సుమారు వెయ్యి గజాల స్థలం కబ్జా


దేవాదాయ శాఖ భూమిలో వెలిసిన ప్రహరీ

మొయినాబాద్: మనకు ఏ కష్టం వచ్చినా దేవుడికి మొక్కుకుని మొర పెట్టుకుంటాం.. కానీ, దేవుడి భూములకే రక్షణ లేకుండా పోయింది. భూ కబ్జాదారులు ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే చాలు అక్కడ వాలిపోతున్నారు. మొయినాబాద్ మండలం తోలుకట్టలో దేవుడి భూమిని కబ్జాచేసి దాని చుట్టూ ప్రహరీ గోడను నిర్మిస్తున్నారు. సంరక్షించాల్సిన దేవాదాయ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో కబ్జాదారులు యథేచ్ఛగా ఆక్రమిస్తున్నారు.

సుమారు రూ.కోటి విలువ

మండలంలోని తోలుకట్ట రెవెన్యూలోని సర్వేనంబర్ 131లో హనుమాన్ దేవాలయానికి సంబంధించి 8.29 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిని గతంలో ఓ వ్యక్తి కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టాడు. దేవాదాయ శాఖ అధికారులు కోర్టుకు వెళ్లి ఏడాది క్రితం ఆ భూమిని స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం ఎకరం భూమిపై కోర్టు స్టే కొనసాగుతుంది. కాగా, మిగిలిన 7.29 ఎకరాల భూమి దేవాదాయ శాఖ ఆధీనంలోనే ఉంది. ప్రస్తుతం ఓ వ్యక్తి సుమారు వెయ్యి గజాల స్థలాన్ని కబ్జా చేస్తున్నాడు. తోలుకట్ట గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డు పక్కన ఉన్న వెయ్యి గజాల స్థలం చుట్టూ ప్రీకాస్ట్ వాల్ నిర్మిస్తున్నాడు. బహిరంగ మార్కెట్‌లో దీని విలువ సుమారు రూ.కోటి వరకు ఉంటుంది. గత నాలుగైదు రోజులుగా కబ్జా పర్వం కొనసాగుతుంది.

కబ్జాల పర్వం నడుస్తోంది..



తోలుకట్ట గ్రామంలో భూకబ్జాలు చాలా అవుతున్నాయి. ప్రభుత్వ భూములు, దేవుడి భూములను ఇష్టానుసారంగా కబ్జా చేస్తున్నారు. 131 సర్వే నంబర్‌లో ఎండోమెంట్ భూమి ఓ రిసార్ట్ పక్కన ఉండటంతో కబ్జా చేసి అమ్ముతున్నారు.

– భుజంగరెడ్డి, రైతు, తోలుకట్ట

పనులు ఆపాం..



దేవాదాయ శాఖ భూమిలో ప్రీకాస్ట్ వాల్ పనులు జరుగుతున్నట్లు తెలిసింది. వెంటనే పనులు నిలిపివేశాం. ఎండోమెంట్ అధికారులు వస్తే సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేయిస్తాం. కబ్జాకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటాం.

– గౌతమ్‌కుమార్, తహసీల్దార్, మొయినాబాద్

విద్యుత్ తీగ తెగిపడి ఎద్దు మృతి

మొయినాబాద్: మేత మేస్తున్న ఎద్దుపై 11 కేవీ విద్యుత్ తీగ తెగిపడటంతో ఎద్దు మృతి చెందింది. ఈ సంఘటన మండల పరిధిలోని చిలుకూరులో చోటుచేసుకుంది. బాధితుడు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మహ్మద్ గనిమియా శుక్రవారం ఉదయం వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి ఎడ్లను మేత మేసేందుకు వదిలారు. అదే సమయంలో 11 కేవీ విద్యుత్ తీగ తెగి ఒక ఎద్దుపై పడటంతో విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందని.. బాధిత రైతును ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. విద్యుత్ శాఖ ద్వారా రైతుకు పరిహారం ఇప్పించేందుకు కృషి చేస్తామని విద్యుత్ ఏఈ రాజేష్‌బాబు తెలిపారు.

బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడిగా సాయిలాల్‌నాయక్


సాయిలాల్‌నాయక్

కడ్తాల్: మండల పరిధిలోని గోవిందాయిపల్లి తండాకు చెందిన బాణవత్ సాయిలాల్ నాయక్ జిల్లా బీజేపీ గిరిజన మోర్చా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా బీజేపీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి సాయిలాల్‌నాయక్‌కు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాయిలాల్‌నాయక్ మాట్లాడుతూ.. పార్టీకి చేసిన సేవలను గుర్తించి, జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షుడిగా నియమించినందుకు, పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారికి, గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కల్యాణ్‌నాయక్‌కు, జిల్లా పార్టీ అధ్యక్షుడు నర్సింహారెడ్డికి, రాష్ట్ర నాయకులు కండె హరిప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

లింగంపల్లి చోరీ కేసులో నిందితుడి అరెస్టు

నిందితుడు పాతనేరస్తుడు శివగా గుర్తింపు


నిందితుడు శివ

మంచాల: మండలంలోని లింగంపల్లిలో ఓ ఇంట్లో జరిగిన చోరీ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మంచాల సీఐ బాబ్యనాయక్ కథనం ప్రకారం.. ఈనెల 11న మంచాల మండల పరిధిలోని లింగంపల్లిలో కసరమోని మల్లేశ్ ఇంటికి తాళం వేసి రోజువారి మాదిరిగా వ్యవసాయ పనులకు వెళ్లాడు. అయితే గుర్తుతెలియని వ్యక్తులు మధ్యాహ్నం సమయంలో ఇంటికి వేసిన తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న 28 గ్రాముల బంగారం అపహరించారు. సాయంత్రం ఇంటికి వచ్చిన మల్లేశ్ కుటుంబ సభ్యులు తాళం పగులగొట్టి ఉండటాన్ని గమనించి మంచాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్ టీం దొంగతనం జరిగిన ఇంటిలోపలి వేలిముద్రలను సేకరించారు. అనంతరం విచారణ మొదలుపెట్టగా వేలిముద్రలు గతంలో పలు దొంగతనాలకు పాల్పడిన అంబర్‌పేట బతుకమ్మకుంట ప్రాంతానికి చెందిన అల్లం శివ అనే నేరస్తుడివిగా గుర్తించారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒపుకోవడంతో అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. కాగా నిందితుడు ఇటీవల ఇబ్రహీంపట్నంలో కూడా ఓ ఇంట్లో దొంగతనం చేసినట్లు పోలీసుల విచారణలో బయట పడింది.